క్లుప్తంగా

మహిళా సౌభాగ్యం ఆరోగ్యమే ప్రధానం

- ఆరోగ్య మహిళ కేంద్రం ప్రారంభం



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మహిళా సౌభాగ్యంతో పాటు ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో మహిళల ఆరోగ్యం కోసం పైలట్ ప్రాజెక్టుగా ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాలను ఎంపిక చేశారన్నారు. ఎనిమిది రకాల వ్యాధుల నిర్ధారణకు కేంద్రాల్లో పరీక్షలను చేస్తారన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్, డయగ్నోస్టిక్, పోషణ లోపాలు, లైంగిక వ్యాధులు, శరీర బరువు, మోనోపాజ్ సమస్యలు వంటి వాటికి ఇక్కడ వైద్యం అందిస్తారన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌతంరావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీటీసీ బాలకిషన్, ఉపసర్పంచ్ మంజుల, వైద్యాధికారి గీతాంజలి, హెచ్ఈవో యాదగిరి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



కేజీబీవీలో క్రీడాకారులతో ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: విద్యార్థులు చక్కగా చదువుకోవడంతోపాటు క్రీడల్లోనూ రాణించి సత్తా చాటాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. మంగళవారం పద్మనగర్ కేజీబీవీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన మండల స్థాయి క్రీడాకారుల సెలక్షన్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మానస మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి మండలానికి గుర్తింపు తీసుకురావాలని ఉత్తేజపరిచారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చదువుతోపాటు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముదారి పోచయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ వెంకట రమణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కందుకూరి రామాగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ శోభ, జిల్లా క్రీడా అధికారి అజ్మీరా రాందాస్, హెచ్ఎం దూస గోవర్ధన్, పీఈటీలు పద్మశ్రీ, దేవత ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉరుపుల భవనాలు



చందుర్తి: ఫొటోలో అందంగా కనిపిస్తున్న ఈ భవనం చందుర్తి మండల పరిషత్ కార్యాలయం, పైకి అలా కనిపిస్తున్న ఈ భవనం లోపలికి వెళ్లి చూస్తే ‘పైన పటారం.. లోన లొటారం’ అని తేలిపోతుంది. ఇది కేవలం మండల పరిషత్ భవనమే కాదు. చందుర్తి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల భవనాల తీరు. తేలికపాటి వర్షం పడినా ఆ భవనాలు ఉరుస్తాయి. ఇక భారీ వర్షం పడితే భయంతో వణికిపోవడమే. వర్షాకాలం కార్యాలయాల్లో ఏ గదికి వెళ్లిన వర్షపు నీరే కనబడుతోంది.



చందుర్తి ప్రాథమిక ఆరోగ్య భవనం పరిస్థితి

- పట్టింపులేని అధికారులు
- కార్యాలయాల గదుల్లో వర్షపు నీరు
- ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోని వైనం
- అవస్థలు పడుతున్న సిబ్బంది



మండల పరిషత్ కంప్యూటర్ గదిలో వర్షపు నీరు

దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా చందుర్తి మండల పరిషత్ కార్యాలయ ప్రవేశ ద్వారానికి రంగులు వేయించిన అధికారులు కార్యాలయ మరమ్మతులు మరిచారు. వర్షాకాలంలో కార్యాలయంలో కంప్యూటర్లు, ఫైళ్లను కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కార్యాలయంలో కంప్యూటర్ గది ఉరుస్తుండడంతో నీటిని బకెట్‌తో బయట పారబోయాల్సి వస్తోందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది.

ఆరోగ్య కేంద్రం.. ప్రాణ సంకటం

చందుర్తి పీహెచ్‌సీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేసి 8 మాసాలు గడిచిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు పనులు పిల్లర్ల దశలో ఉండడంతో నిర్మాణానికి మరో రెండు నెలలు పట్టేలా ఉందని వైద్య సిబ్బంది అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గదుల్లో సిమెంట్ పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. దీంతో వైద్య సిబ్బంది గదుల్లో ఉండే కన్నా ఆసుపత్రి ఆవరణలో కుర్చీలు వేసుకుని వైద్య సేవలు అందించే దుస్థితి నెలకొంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరండాతో పాటు, గదులన్నీ తడిచి ముద్దయ్యాయి. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులపై పెచ్చులూడి పైన పడితే ఎక్కడ గాయపడుతారోనని వారిని వచ్చిన వెంటనే పరీక్షలు చేసి ఇళ్లకు పంపిస్తున్నారు.

సెస్ కార్యాలయంలో అదే దుస్థితి

సెస్ కార్యాలయ భవనం పరిస్థితి అలాగే ఉంది. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, సెస్ విలేజీ వర్కర్లు కార్యాలయం ఎదుట ఉన్న రేకుల షెడ్డు కిందనే కూర్చుంటున్నారు. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించిన కార్యాలయ భవనం కావడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడ పడితే అక్కడే స్లాబ్ పెచ్చులూడి పోయి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి.



పెచ్చులూడి ఉరుస్తున్న సెస్ కార్యాలయ భవనం

నిర్మాణం పూర్తిచేయాలి



నాలుగేళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. తరుచు స్లాబ్ ఊడి కింద పడుతుంది. అంతేకాకుండా అసుపత్రి గదులన్నీ వర్షపు నీటికి ఉరుస్తున్నాయి. తడిసిన గోడలకు అప్పుడప్పుడు విద్యుత్ షాక్ వస్తుంది. గదుల్లో ఉండేందుకు భయపడుతున్నాం. త్వరగా పనులు పూర్తి చేయాలి. – ఆనందం, పీహెచ్‌సీ సిబ్బంది

మరమ్మతుకు నిధులు లేవు



మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మూత్రశాలలు నిర్మించాలని నాలుగేళ్లుగా మండల సభలో తీర్మానం చేసిన నిధులు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రం రూ.లక్షల్లో వృథా చేస్తున్నారు. అవసరమైన పనులు చేయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. – మ్యాకల గణేశ్, ఎంపీటీసీ, జోగాపూర్

ప్రతిపాదనలు సిద్ధం చేశాం



మండల పరిషత్ కార్యాలయం మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే గదులు ఉరుస్తున్నాయి. మరమ్మతు చేయించేందుకు రూ.3.50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వర్షాలు పడడంతో పనులు చేయించలేకపోతున్నాం. స్టేట్ ఫైనాన్స్ నిధులతో త్వరలోనే చేపడుతాం. – పత్తి రవీందర్, ఎంపీడీవో, చందుర్తి

నృసింహుని సన్నిధిలో జెడ్పీ చైర్‌పర్సన్

వేములవాడరూరల్: వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని, అగ్రహారం జోడాంజనేయ స్వామివారిని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, రాఘవరెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ దంపతులు

దుర్గామాతకు పూజలు

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేటలోని శ్రీదుర్గామాత ఆలయంలో శ్రావణ మాస చివరి మంగళవారం అమ్మవారికి మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దయానంద ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం చేశారు. ప్రత్యేక పూజల అనంతరం కుంకుమ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు రావుల మల్లారెడ్డి, పాల్గొన్నారు.

చిత్రకథ



ప్రమాదపుటంచున భక్తులు

వేములవాడ: నెత్తిన బోనాలతో పోశవ్వ తల్లికి బోనం మొక్కులు చెల్లించుకునేందుకు నిత్యం వేలాదిగా తరలివచ్చే ఈ రోడ్డుపై ఓ గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఏదైనా ప్రమాదం జరగక ముందే ఆలయ అధికారులు, మున్సిపల్ అధికారులు గొయ్యిని పూడ్చాలని భక్తులు కోరుతున్నారు.

నియామకం

యాదవ యువజన సంఘం కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మిరాల భాస్కర్ యాదవ్ అధ్యక్షతన సిరిసిల్ల పట్టణ యాదవ యుజన సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సగ్రేంది వేణుగోపాల్ యాదవ్, గౌరవాధ్యక్షుడు బోనాల రమేశ్, ఉపాధ్యక్షులుగా సందేవేణి పవన్‌కళ్యాణ్, లద్దునూరి నవీన్, ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల సాయికిరణ్, కోశాధికారి అజయ్, కార్యవర్గసభ్యులు మ్యాక సాయి కిరణ్, పోచవేణి నాగరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, టీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ కిషన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ప్రచార కమిటీ చైర్మన్‌గా ఐలయ్య

ఇల్లంతకుంట: కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కమిటీ చైర్మన్‌గా మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్యను నియమించినట్లు కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్సై వెంకటరమణ

ముస్తాబాద్: మండలంలో శాంతియుత వాతావరణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఏఎస్సై వెంకటరమణ అన్నారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏఎస్సై మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. కూడళ్లలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే చోట మండపాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. ప్రజలలో భక్తి భావం పెరిగేలా గణేశ్ మండపాల వద్ద కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

మత్తు పదార్థాలపై దండోరా



దండోరా ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

బోయినపల్లి: యువకులు గంజాయి, గుట్కా, తదితర మత్తు పదార్థాలు వాడి తమ విలువైన జీవితాలు నాశనం చేసుకోవద్దని ఏఎస్సై బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మత్తు పదార్థాలు వాడొద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తూ దండోరా వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటైన వారి వివరాలు తమకు వారి తల్లిదండ్రులు తెలియచేస్తే వారికి మానసిక వైద్యులచే కౌన్సెలింగ్ ఇప్పిస్తామన్నారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

కోనరావుపేట: మండలం నిమ్మపల్లిలో మృతి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అనుముల నర్సయ్య కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. మల్కపేటలో ఇప్ప వెంకటేశ్ అత్తమ్మ లక్ష్మి మృతి చెందగా, మోతీరాం భార్య మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకులు పాల్గొన్నారు.

కృతజ్ఞత ర్యాలీని విజయవంతం చేయాలి

ముస్తాబాద్: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈనెల 15న బీఆర్ఎస్ తలపెట్టిన సీఎం కృతజ్ఞత ర్యాలీకి వేలాది తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు.సీఎం కృతజ్ఞతా సభ సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 15న వర్చువల్‌గా సిరిసిల్ల మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారన్నారు. సిరిసిల్లలో భారీ ర్యాలీ, కృతజ్ఞత సభకు వేలాదిగా తరలిరావాలన్నారు. మంత్రి కేటీఆర్ పాల్గొనే సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేటలో జెడ్పీటీసీ కార్యాలయంలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ సిరిసిల్లలో జరిగే మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి కృతజ్ఞత ర్యాలీ, సభను తరలిరావాలని పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ పాల్గొనే ర్యాలీలో బీఆర్ఎస్ శ్రేణులు, యువత, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్, బాల్‌రెడ్డి, అందె సుభాష్, గుళ్లపెల్లి నర్సింహారెడ్డి, అనసూయ పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న సురేందర్‌రావు

కళాకారులకు సత్కారం



సన్మానిస్తున్న కళా సంస్థల సభ్యులు

వేములవాడరూరల్: నెల్లూరు జిల్లా కొవ్వూరుకు చెందిన శ్రీసుమధుర నాట్య మండలి కళాకారులను మంగళవారం జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య సభ్యులు వేములవాడలో సత్కరించారు. కళాకారులు షేక్ కుద్దూస్‌భాష, పోతినేని వెంకటేశ్వర్లు, వెంకటరాజు, వినయ్‌కి శాలువా కప్పి రాజన్న చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో యెల్ల పోచెట్టి, వారాల దేవయ్య, బొడ్డు రాములు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు తెచ్చారు.. పంపిణీ మరిచారు

తంగళ్లపల్లి: ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానికి అనుగుణంగా ఆటగాళ్ల కోసం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ పేరుతో ఆట వస్తులను సైతం ప్రభుత్వం సమకూర్చింది. ఎంపీడీవో కార్యాలయానికి రెండు నెలల క్రితం 30 గ్రామాలకుగాను స్పోర్ట్స్ కిట్లు వచ్చి చేరాయి. కానీ గ్రామపంచాయతీలకు పంపిణీ చేయడం మాత్రం అధికారులు మరిచారు. వాటిని ఎంపీడీవో చాంబర్‌లోనే పేర్చి ఉంచారు. కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ విషయమై ‘సాక్షి’ ఎంపీడీవో పి.లచ్చాలును వివరణ కోరగా పంపిణీ కొరకు ఆదేశాలు రాలేదని తెలిపారు.



ఎంపీడీవో గదిలో పేర్చిన స్పోర్ట్స్ కిట్లు

ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

తంగళ్లపల్లి: రాబోయే ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఓటర్ లిస్టులో తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.లచ్చాలు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ టోని, ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, ఆయా పార్టీల మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



బోయినపల్లి: అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

బోయినపల్లి: మండలంలో ఎన్నికల నిర్వహణ సక్రమంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకరించాలని తహసీల్దార్ పుష్పలత, వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు. ఎస్సై మామిడి మహేందర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలి

బోయినపల్లి: మండలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి తదితర పథకాలు బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికే ఇస్తున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి అలా ఉన్న పేర్లను తొలగించాలని కోరారు. నాయకులు నర్సింహాచారి, పరశురామ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజూరి కిరణ్, సావనపెల్లి అనీల్ పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలం మల్కపేట రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలని అఖిలపక్షం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి నాటి నిజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా, రజాకార్లను ఎదురించి పోరాడిన యోధుడు కర్రోల్ల నర్సయ్య అన్నారు. భూస్వాములు, పెత్తందార్లను ఎదిరించి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడారన్నారు. నర్సయ్య సొంత గ్రామం మల్కపేటలో ప్రాజెక్ట్ కడుతూ అతని పేరు మర్చిపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మల్కపేట రిజర్వాయర్‌కు కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జవ్వాజి విమల, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, సీపీఎం జిల్లా నాయకులు చిలుక నాగరాజు, అఖిలపక్షం నాయకులు దేవదాస్, మల్లారపు ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రుద్రంగి: మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు మంగళవారం రుద్రంగి మండల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రక్త హీనత పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయి కృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ అర్చన, ఏఎన్ఎం విజయ, ఎస్‌వో వనిత, ఆశా వర్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో అభివృద్ధి పనులకు నిధులివ్వాలని సర్పంచ్ గున్నాల అరుణ, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను కోరారు. ధర్మారంలోని పత్రెగడ్డ ఒర్రె వద్ద సీసీ రోడ్డుకు, మల్లన్న గుడి ముందు ఓపెన్ స్లాబ్, పెద్దమ్మ గుడి దగ్గర ప్రహరీ, శ్మశానవాటిక వద్ద హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేసేందుకు నిధులు ఇవ్వాలని కోరగా త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గంగుల ప్రశాంత్, అగ్రహారం టెంపుల్ డైరెక్టర్ సిద్దంశెట్టి శ్రీనివాస్, నాయకులు ఎల్లయ్య, గోపాల్‌రావు, డైరెక్టర్ రాములు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కోనరావుపేట: మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన సుదమల్ల భాస్కర్‌కు రూ.12 వేలు, బర్మ అరుణ్‌కుమార్‌కు రూ.10 వేలు, లంబ పూజితకు రూ.20 వేలు, బంటు కీర్తనకు రూ.15 వేలు, దున్న ప్రేమలకు రూ.19 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వైస్‌ఎంపీపీ వంగపెల్లి సుమలత, మాదాసు భూమయ్య, లక్ష్మణ్‌గౌడ్ అందజేశారు. వెంకట్రావుపేటలో కర్నాల రమేశ్‌కు రూ.12 వేలు, సందు నాగరాజుకు రూ.22 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ మంతెన సంతోష్, ఉపసర్పంచ్ మ్యాకల భూమయ్య, జొర్రీగ మల్లేశం అందజేశారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం

వీర్నపల్లి: మండల రజక సంఘం ఆధ్వర్యంలో నూతన ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైనా లోకుర్తి లక్ష్మి, పొన్నం దేవరాజును మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. లోకుర్తి దేవయ్య, గొల్లపల్లి భూమయ్య, పొన్నం హన్మాండ్లు, జోగినిపల్లి మల్లేశం పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన గీతా కార్మికుడు బత్తిని మల్లయ్య మంగళవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయాలపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. మల్లయ్య ఎప్పటిలాగే తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు జారీ కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు మల్లయ్యను ఆసుపత్రికి తరలించారు.

చిన్నారి వైద్యానికి సాయం

కోనరావుపేట: మండలం కనగర్తి గ్రామానికి చెందిన పులి రవి–నిర్మల దంపతుల కూతురు(8 నెలలు) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా చల్మెడ యువసేన నాయకులు జవ్వాజి ప్రసాద్ రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన రవి కూతురు న్యూమోనియాతో బాధపడుతూ హైద్రాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ కార్యక్రమంలో యువసేన నాయకులు జీవన్‌గౌడ్, మహేశ్, మాందాల శ్రీనివాస్, బడే అంజి, వెంకటేశ్ ఉన్నారు.